క్లుప్తంగా

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలోని రామస్వామి గుట్టపై కొలువైన శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం మార్చి 8వ తేదీన నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణోత్సవ వాల్ పోస్టర్‌ను శుక్రవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ కార్యనిర్వాహకుడు కందారపు రమేశాచార్యులు ఆహ్వానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామంచ విద్యార్థిని



అక్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలో 400 మీటర్ల రన్నింగ్‌లో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షిత ప్రతిభ చూపి ఎంపికైంది. ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని పీఈటీ ఉప్పలయ్య తెలిపారు. అక్షితను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, హెచ్‌ఎం సత్యవతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

సిద్దిపేటకమాన్: ట్రస్టెడ్ అడ్వొకేట్స్ అసోసియేషన్ (టీఏఏ) 2024 డైరీని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం టీఏఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్, న్యాయవాది రాజలింగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో టీఏఏ న్యాయవాదులకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్, వేణుగోపాలాచారి, శేషుకుమార్, వంశీకృష్ణ, రమేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): యాసంగి వరి సాగులో మొగి పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిగుల్, దౌలాపూర్ గ్రామాల రైతులు సాగుచేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగి పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట రక్షణకు 30 కిలోల పొటాష్ ఎరువును రెండుసార్లు వేసుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం

దౌల్తాబాద్(దుబ్బాక): యువతకు క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. మండల పరిధిలోని హైమద్ నగర్ గ్రామ షేక్‌పీర్ దాస్ గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారం రోజులుగా ఏపీఎల్ లీగ్ మ్యాచ్ లెవల్‌లో సాగిన టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని శ్రీసత్యసాయి ధ్యాన మండలి గురాజీ భిక్షమయ్య అన్నారు. శుక్రవారం శ్రీ సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్‌లో ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా అందరూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



రామలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం (ఇన్‌సెట్‌లో) గర్భగుడిలో శ్రీ రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

- కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం
- శివరాత్రి వరకు కొనసాగనున్న ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు

బెక్కల్ శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలోని రామాచల గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని క్రీ.శ 1117 కాకతీయుల రాజుల పాలనలో నిర్మించారు. ప్రస్తుత బెక్కల్‌ను అప్పట్లో భద్రంగపురంగా పిలిచేవారని ప్రచారంలో ఉంది. ఈ భద్రంగపురాన్ని కాకతీయ సామంత రాజైన మాల్లారెడ్డి తన వంశీయుల పేరున శివలింగాలను ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. గ్రహపీడితులు, అనారోగ్యం బారిన పడిన ఎంతో మంది ఆలయంలో 45 రోజుల పాటు దీక్షలు చేపట్టి స్వామి వారిని ఆరాధిస్తారు. ఈ ఆలయానికి సమీపంలోనే పోచమ్మ దేవాలయం నిర్మించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు పోచమ్మ తల్లిని దర్శించుకుంటారు. ఏటా ఫిబ్రవరిలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

– మద్దూరు(హుస్నాబాద్)

స్వామివారి ఉత్సవాలను శనివారం తెల్లవారుజామున 5 గంటలకు స్వామి వారిని మేలుకొల్పి అనంతరం 6 గంటలకు దిష్టి కుంభంతో ప్రారంభిస్తారు. 10 గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం బండ్ల సేవ, రాత్రి అమ్మాపురం కళాకారులచే నాటకాన్ని ప్రదర్శిస్తారు. 25వ తేదీన స్వామి వారికి రుద్రాభిషేకలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రికి నాటక ప్రదర్శన ఉంటుంది. 26న స్వామి వారికి అర్చనలు, క్షీరాభిషేకాలు చేస్తారు. 27న అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, గోత్రనామార్చనలు, రాత్రికి సింధు కళాకరుల నాటక ప్రదర్శన ఉంటుంది.

29న గంగ స్నానం, అనంతరం 11.45కు అభిజిత్ లగ్నంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీన స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు జరుగుతాయి. 2న ప్రత్యేక పూజలు, 3వతేదీ బిల్వార్చనలు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం సుంకు బియ్యం సమర్పణ, భద్రకాళి అమ్మవారి ఆహ్వాన కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 5వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అనంతరం వీరభద్ర విజయం గెలుపు కార్యక్రమం జరుగుతుంది. 6వ తేదీ ఏకాదశ అభిషేకాలు, అర్చనలు, 7న ద్వాదశ అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. 8 తేదీ రాత్రి మల్లికార్జున స్వామికి పెద్ద పట్నం, గ్రామస్తులు బోనాలు సమర్పిస్తారు. దేవాలయానికి హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, జనగామ, హన్మకొండ, హుస్నాబాద్, చేర్యాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

పాలక మండలి లేకుండానే ఉత్సవాలు

ప్రాచీన శైవాలయంలో బెక్కల్ శ్రీరామలింగేశ్వర స్వామిబ్రహ్మోత్సవాలు ఈసారి పాలక మండలి లేకుండానే కొనసాగనున్నాయి. ఏటా ఉత్సవాల నిర్వహణకు నెల ముందుగానే పాలక మండలిని ఎన్నుకునే వారు. 20 రోజుల క్రితం దేవాదాయ శాఖ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ నూతన పాలకమండలిని ఎన్నుకోలేదు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సావిత్రి

గజ్వేల్‌రూరల్: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సావిత్రి హెచ్చరించారు. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో బాలికకు వివాహం చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం సీడీపీవో వెంకటరాజమ్మతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులను కలిసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. మైనర్లకు వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాలల పరిరక్షణ విభాగం అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకొని మైనర్ బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించారు.

ప్రశాంతంగా టోల్ ప్లాజా నిర్వహణ

సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ



దుద్దెడలో టోల్‌ప్లాజా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

కొండపాక(గజ్వేల్): టోల్ ప్లాజా నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని దుద్దెడ శివారు రాజీవ్ రహదారిలోఉన్న టోల్‌ప్లాజా వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందికి టోల్ ప్లాజా నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే కొండపాక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరం ఏర్పాటుచేసి టోల్ ప్లాజా ఉద్యోగులు, ప్రయాణికులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, 3టౌన్ సీఐ విద్యాసాగర్, ఆర్అండ్‌బీ ఇంజనీర్ పీవీ రావు, టోల్ ప్లాజా డీజీఎం విజయ్ భాస్కర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ ఎంఎస్‌వై రావు, మేనేజర్ అశోక్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వర్గల్(గజ్వేల్): నెంటూరులో స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



నంగునూరు(సిద్దిపేట): తిమ్మాయిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో..

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా లాస్య, హెచ్‌ఎంగా సాత్విక్, ఉపాధ్యాయులుగా సంజన, సాకృతి, విష్ణుప్రియ, చాందిని, అజయ్, అనిల్, అనూక్ వ్యవహరించారు. వారిని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు.

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని తిమ్మాయిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులై ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా రితేష్, హెచ్‌ఎంగా ప్రవలిక, ఉపాధ్యాయులుగా వర్ష, శ్రీవాణి, నవీన, శరణ్య, నాగరాజు, శివసాయి, రాకేష్ వ్యవహరించారు. విద్యార్థులను ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మురుగు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే చర్యలు

గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య



మాట్లాడుతున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్: సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, మురుగు కాల్వల్లో పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని సెప్టిక్ ట్యాంకు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకు ద్వారా వ్యర్థాలను సేకరించేటప్పుడు పర్సనల్ ప్రొటెక్షన్ కిట్ (పీపీఈ కిట్) వాడాలన్నారు. సేకరించిన వ్యర్థాలను తప్పనిసరిగా మున్సిపాలిటీకి చెందిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్ఎస్‌టీపీ)కు తరలించాలని సూచించారు. నిబంధనలు పాటించనివారి వాహనాల లైసెన్స్‌లు రద్దు చెస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

జగదేవ్‌పూర్(గజ్వేల్): 54 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజన్న మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాలలేని రోజుల్లో జగదేవ్‌పూర్‌లో కళాశాల ప్రారంభించారన్నారు. కళాశాలలో ఎంతోమంది విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకున్నారన్నారు. అనంతరం గత ఏడాది వార్షిక పరీక్షలో కళాశాల టాపర్‌గా నిలిచిన హసీనకు ఏఎస్ఆర్ పీపుల్స్ ట్రస్టు జగదేవ్‌పూర్ సంస్థ నగదు బహుమతి అందజేసింది. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, చాందీకుమారి, శ్రీనివాస్, మోహన్‌దాస్, స్వామి, శ్రీనివాస్‌రావు, సతీష్, లక్ష్మారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వనదేవతల జాతర



గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్‌కాలనీలో అమ్మవార్ల జాతర

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పాత కమాన్ వద్ద సమ్మక్క, సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. బుధవారం సారలమ్మను, గురువారం సమక్కను గద్దెల వద్ద ప్రతిష్ఠించడంతో శుక్రవారం అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. కొంత మంది బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొమురవెల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మలకు శుక్రవారం భక్తులు దర్శించుకున్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. హుస్నాబాద్‌తో పాటుగా వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత మొక్కులు చెల్లించారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సమ్మక్క, సారలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. రెండేళ్లకు ఒకసారి వచ్చే జాతరలో అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేస్తారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, గడ్డం మల్లయ్య, కొమ్మెర నర్సింహరెడ్డి, కానుగుల మోహన్, కర్ర రవీందర్ రెడ్డి, శ్యాంసుందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె, తోటపల్లి, వడ్లూరు, గుండారం గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు తరలివచ్చారు. శుక్రవారం ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఒడిబియ్యం పోసి అమ్మవార్లకు పూజలు చేశారు.

ఒడిబియ్యం పోసి..

నంగునూరు(సిద్దిపేట): అక్కేనపల్లిలోని సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రాంగణం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. మూడోరోజు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి, నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా వన భోజనాలు చేశారు.

గజ్వేల్‌రూరల్: వనదేవతలు సమ్మక్క–సారలమ్మల జాతర గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(లక్ష్మక్కపల్లి)లో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. గ్రామంలో కొలువుదీరిన అమ్మవార్లకు ఆలయ పూజారి పర్శరాములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క–పగిడిద్దరాజుల కల్యాణోత్సవం, చంద్ర పట్టము తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గావురంగాలతో పాటు అమ్మవారి శాంతికొలువుట నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



హుస్నాబాద్: మొక్కులు సమర్పించుకుంటున్న మహిళా భక్తులు

హద్దులు చూపేవరకు వెళ్లొద్దు

త్రీటౌన్ పోలీసులు



ఖమ్మంపల్లిలో గ్రామస్తులకు నచ్చజెబుతున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి శివారులోని ప్రభుత్వ భూమి హద్దులు చూపే వరకు ఎవరూ వెళ్లకూడదని శుక్రవారం త్రీటౌన్ పోలీసులు అన్నారు. గ్రామ శివారులోని 1060, 1061 నంబర్లలో 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో పది ఎకరాలు గ్రామాభివృద్ధికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. కొంత స్థలంలో డంప్ యార్డును నిర్మించారు. ఈ క్రమంలో ఇదే భూమిని సిద్దిపేట తదితర గ్రామాలకు చెందినవారు సిద్దిపేట కలెక్టర్ పట్టా చేశారని చెప్పడంతో అప్పట్లో గొడవ జరిగింది. సమస్యను ఎవరూ పట్టించుకోకపోవంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గురువారం ఖమ్మంపల్లి గ్రామస్తులు ముళ్ల పొదలను తొలగిస్తుండగా కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అక్కడికి చేరుకొని ఘర్షణకు దిగారు. శుక్రవారం పోలీసులు ఇరువురి వాదనలు విన్నారు. రెవెన్యూ అధికారులు హద్దులు చూపే వరకు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామ శంకరయ్య, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానమే పునాది

సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను



అల్లీపూర్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చిన్నకోడూరు(సిద్దిపేట): శాస్త్రీయ విజ్ఞానమే దేశాభివృద్ధికి పునాది అని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లీపూర్ కేజీబీవీలో మూఢ నమ్మకాల నిర్మూలన, విద్య ఆవశ్యకత, మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ పద్ధతులు అలవాటు చేసుకోవాలన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీ టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మహిళ రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, సిద్దిపేట షీ టీమ్ సభ్యుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నూతన కార్యవర్గం ఎన్నిక**

సిద్దిపేటకమాన్: జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రధర్, జనరల్ సెక్రటరీగా భాస్కర్, ట్రెజరర్‌గా స్వామి, ఉపాధ్యక్షులుగా కొండయ్య, మల్లయ్య ఎన్నికయ్యారు. వీరితోపాటు జాయింట్ సెక్రటరీ, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు.

◆ **అంతర్గత బదిలీలు**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో అంతర్గత బదిలీలు శుక్రవారం చేపట్టారు. శానిటేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నవీన్‌ను ఎలక్ట్రికల్, వాటర్ సప్లయి స్టోర్ ఇన్‌చార్జిగా, సందీప్‌ను గదుల విచారణ నుంచి శానిటేషన్‌కు, శ్రీనివాస్‌రెడ్డిని అన్నదానం నుంచి గదుల విచారణకు, మాధవిని బుకింగ్ నుంచి సెంట్రల్ స్టోర్‌కు, సెంట్రల్‌స్టోర్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సింహులును బుకింగ్‌కు బదిలీ చేస్తూ ఆలయ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ **బోరు మోటార్ చోరీ**

మద్దూరు(హుస్నాబాద్): పొలంలోని బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో జరిగింది. శుక్రవారం ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు కూరెళ్ల బాలయ్య పొలంలోని బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి దొంగిలించారు. దీంతో పోలీసులకు రైతు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

◆ **కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

గజ్వేల్‌రూరల్: కరాటే స్వీయ రక్షణకు దోహదపడుతుందని, తమ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తా చాటడం సంతోషంగా ఉందని గజ్వేల్‌లోని మహతి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ గోపీనాథ్‌శర్మ శుక్రవారం అన్నారు. ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లో రుద్రమదేవి మెగాకప్ 4వ నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొని ఏడు బంగారు, తొమ్మిది వెండి పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందించారు.

◆ **ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి**

దుబ్బాక: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైశ్య భవన్‌లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరశురాం మాట్లాడుతూ శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆనంద్ రాజ్, త్రివిక్రమ్, రాజినేష్ , కిషోర్ పాల్గొన్నారు.

◆ **చేసిన సేవలే గుర్తింపునిస్తాయి**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని, వారు చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజు అన్నారు. ఎంపీడీఓ రాజిరెడ్డి మెదక్ జిల్లా చిన్న శంకరంపేటకు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు. చిన్న శంకరంపేట నుంచి వచ్చిన ఎంపీడీఓ గణేష్‌రెడ్డికి స్వాగతం పలికారు.

◆ **సైన్స్‌పై ఆధారపడిన కళ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మ్యాజిక్ అనేది సైన్స్‌పై ఆధారపడిన కళ అని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవాణి పాఠశాలలో ప్రపంచ మ్యాజిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంద్రజాలికుడు రమేష్ తన మ్యాజిక్‌ను ప్రదర్శించారు. పీసీ సర్కార్ జయంతిని ప్రపంచ మ్యాజిక్ డేగా జరుపుకుంటామన్నారు. 64 కళల్లో మ్యాజిక్ ఒకటన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **పుండరీకం మృతి తీరని లోటు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పద్య సాహిత్యంలో కృషి చేసిన సిద్దిపేటకు చెందిన కవి బొద్దుల పుండరీకం మరణం సాహిత్య లోకానికి తీరనిలోటని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐత చంద్రయ్య అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో జరిగే అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, కవి సమ్మేళనాల్లో కవితా గానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన పద్యకవి బొద్దుల పుండరీకం చిరస్మరణీయులన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ కవులు ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బి.సుధాకర్, కోణం పర్శరాములు, బస్వ రాజ్ కుమార్, మిట్టపల్లి పరశురాములు, సింగీతం నరసింహారావు, తిరుమల క్రాంతి కృష్ణ సంతాపం తెలిపారు.

◆ **మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు**

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ప్రసన్న రాణిని శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మధు, నరేష్, గయజ్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.